# తిమ్మాపూర్ సిఐగా రమేష్



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బొల్లం రమేష్ బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు వరంగల్ కమిషనరేట్ పరిధిలోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ గా పనిచేసిన ఆయన ఇటీవల తిమ్మాపూర్ సర్కిల్ కు బదిలీ అయ్యారు గతంలో కరీంనగర్ జిల్లాలో మానకొండూరు ఎస్సైగా హుజురాబాద్ సిఐగా సిసిఎస్సిఐగా పని చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ కి తిమ్మాపూర్ ఎస్సై అన్వర్ తో పాటు సర్కిల్ పరిధిలోని ఇతర ఎస్సైలు పుష్ప గుచ్చము అందించారు.

# కపిల్ విద్యా వారధి ఆధ్వర్యంలో విద్యార్థులకు అర్హత పరీక్ష

**ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు పై చదువులకు అండగా ట్రస్ట్**

**19 జిల్లాల నుంచి భారీగా విద్యార్థుల హాజరు**



కరీంనగర్, మే 20: పదవ తరగతి పూర్తి చేసుకుని ఆర్థిక ఇబ్బందుల కారణంగా పై చదువులకు దూరమవుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కపిల్ విద్యా వారధి సంక్షేమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అర్హత పరీక్ష నిర్వహించారు. బుధవారం కరీంనగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు పదో తరగతిలో 520కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 19 జిల్లాల నుంచి 917 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 596 మంది పరీక్ష రాశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు 'కపిల్ విద్యా వారధి' అండగా నిలిచేందుకు ఈ అర్హత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పై చదువుల కోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో స్థిరపడే వరకు వారికి మార్గదర్శకత్వం, విద్యా సహాయం అందించేందుకు ట్రస్ట్ కట్టుబడి ఉందని నిర్వాహకులు తెలిపారు.

# ఈనెల 22 నుంచి ఉచిత యోగ విజ్ఞాన శిక్షణా శిబిరం

**జూన్ 21 వరకు యోగ డే కౌంట్‌డౌన్ కార్యక్రమం**

**పతంజలి యోగ సమితి, హార్ట్ ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో నిర్వహణ**

కరీంనగర్, మే 20: అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి యోగ సమితి, హార్ట్ ఫుల్‌నెస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి జూన్ 21 వరకు ఉచిత యోగ విజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు యువ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల రమేశ్ తెలిపారు. "యోగ డే కౌంట్‌డౌన్" పేరుతో నిర్వహించే ఈ శిబిరం రాంనగర్‌లోని శ్రీరామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ కేంద్రంలో ప్రతిరోజూ ఉదయం 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. శిబిరంలో సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, శరీర జ్ఞానం, ఆత్మ జ్ఞానం తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, అధిక బరువు, శారీరక నొప్పులు, మానసిక ఒత్తిడి వంటి సమస్యల నివారణకు యోగ ఉపయోగపడుతుందని పేర్కొంటూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో పాల్గొనదలిచిన వారు 7013023703, 9440065556 నంబర్లకు సంప్రదించి నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

# కొత్తపల్లి పీహెచ్‌సీ, విద్యానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన డీఎంహెచ్‌వో

**హెచ్పీవీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి: డాక్టర్ వెంకట రమణ**



కరీంనగర్, మే 20: జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, పీఓఎంహెచ్ఎన్ డాక్టర్ సనా జవేరియతో కలిసి మంగళవారం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ, హాజరు రిజిస్టర్, ఎన్‌సీడీ రిజిస్టర్, ఫార్మసీ స్టోర్, ఓపీ రిజిస్టర్, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న హెచ్పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలందరూ తప్పనిసరిగా హెచ్పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాక్సిన్ భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ నివారణకు దోహదపడుతుందని తెలిపారు. మహిళా సంఘ సభ్యులతో సమావేశమై ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని సమయానికి వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాజియా ఫాతిమా, డాక్టర్ సాహితీ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభ విజయవంతం చేయాలి

**శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశం**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**







కరీంనగర్, మే 19: ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే జిల్లా స్థాయి సభను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి సభ నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రారంభం నుంచి జిల్లాలో వివిధ శాఖలు నిర్వహించిన కార్యక్రమాలను డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించాలని సూచించారు. ప్రతి శాఖ తమ ప్రగతిపై పది నిమిషాల ప్రదర్శనకు సంబంధించిన సమాచారాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ఆర్థిక సహాయం, అవగాహన కార్యక్రమాలు, బడిబాట, జాబ్ మేళాలు వంటి కార్యక్రమాల వివరాలను సభలో తెలియజేయాలని సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, సన్న రకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు వంటి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాల లబ్ధిదారుల వివరాలను సభలో ప్రస్తావించాలని పేర్కొన్నారు.

శాఖలు సాధించిన విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు లబ్ధిదారుల అనుభవాలను కూడా సభలో పంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు అమలు చేసిన కార్యక్రమాలతో పాటు భవిష్యత్తులో చేపట్టనున్న పనులపై కూడా వివరించాలని అధికారులకు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లా స్థాయి సభను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సీపీఓ రామ్ దత్తారెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కొత్తగట్టు-గొల్లపల్లి గ్రామాల సమస్య పరిష్కారానికి చర్యలు

**నేషనల్ హైవే వద్ద ర్యాంపు నిర్మాణ పనులు ప్రారంభం**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ జోక్యంతో స్పందించిన అధికారులు**



కరీంనగర్, మే 20: కరీంనగర్--వరంగల్ నేషనల్ హైవే నిర్మాణంతో కొత్తగట్టు, గొల్లపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. గ్రామ ప్రజల విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో నేషనల్ హైవే అధికారులు కొత్తగట్టు గ్రామం వద్ద ప్రజలకు కలిగిన ఇబ్బందులను పరిశీలించి రహదారికి ఇరువైపులా ర్యాంపు నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామాల రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా ఈ పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి స్థానిక పార్టీ నాయకులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామ ప్రజల సమస్య పరిష్కారానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుధగోని శ్రీనివాస్ గౌడ్, బూత్ అధ్యక్షుడు బోడ అనిల్, ప్రధాన కార్యదర్శి తీగల శ్రావణ్ కుమార్, సోషల్ మీడియా నాయకుడు చుక్క శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రైతులను దోచుకుంటున్నారు

**మిల్లర్లతో కుమ్మక్కై కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోంది**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆరోపణలు**



కరీంనగర్, మే 20: ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులను నిలువునా దోచుకుంటోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆరోపించారు. నాణ్యమైన ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్‌గా మార్చి రైతులకు నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. బుధవారం కొత్తపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాలను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. క్వింటాల్‌కు రూ.20 వరకు కోతలు విధిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. తాలు, తరుగు పేరిట కోతలు విధించి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త తరహా దోపిడీకి తెరలేపిందని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలను ఉద్దేశపూర్వకంగానే ఆలస్యంగా ప్రారంభించడంతో ధాన్యంలో తేమ శాతం తగ్గిపోయి రైతులు అదనంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐ నిబంధనల కంటే తాలు తక్కువగా ఉన్నప్పటికీ మిల్లర్లు అధికార పార్టీ అండతో చెలరేగిపోతున్నారని విమర్శించారు. రైతులకు ఎలాంటి ఆంక్షలు, కోతలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, కొనుగోలు కేంద్రాలకు లారీల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన ధాన్యాన్ని బి గ్రేడ్‌గా కొనుగోలు చేస్తున్న మిల్లర్లపై, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అకాల వర్షాల నేపథ్యంలో టార్పాలిన్‌లు సరఫరా చేయాలని, కాటా చిట్టీ ప్రకారమే చెల్లింపులు జరపాలని, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుంట తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తరగతి గదులకు అతీతంగా విద్యాభ్యాసం

**సమ్మర్ క్యాంపులతో భవిష్యత్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు**

**పీపీపీ విధానంలో కరీంనగర్‌లో వినూత్న కార్యక్రమం**



కరీంనగర్, మే 20: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని కరీంనగర్ జిల్లాలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు విద్యారంగంలో కొత్త ఉద్యమంగా రూపుదిద్దుకుంటున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష ఎక్స్-ఆఫిషియో జిల్లా ప్రాజెక్టు అధికారి డా. అశ్విని తానాజీ వాకడే, ఐఏఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్, సమగ్ర శిక్ష చైర్‌పర్సన్ మార్గదర్శకత్వంలో మే 15 నుంచి ప్రారంభమైన 15 రోజుల సమ్మర్ క్యాంపులు ప్రభుత్వ, జెడ్పీ, కేజీబీవీ, టీజీఎంఎస్ పాఠశాలల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నారు. మొత్తం 11 ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఉచితంగా ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఈ క్యాంపుల్లో విద్యార్థులకు విద్యా ప్రగతి, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సృజనాత్మకత, శారీరక దృఢత్వం, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన 11కిపైగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొంటుండటంతో కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్నారు. శ్రీ హన్మంతరావు, శ్రీమతి భావని ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ తరగతుల ద్వారా విద్యార్థులు ఇంగ్లీష్ మాట్లాడే నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటున్నారు. ఈ సందర్భంగా డా. అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, "తరగతి గదులకు అతీతంగా జరిగే విద్యాభ్యాసం విద్యార్థులను భవిష్యత్‌కు సిద్ధం చేస్తుంది. ఈ సమ్మర్ క్యాంపులు కమ్యూనికేషన్ నైపుణ్యాలతో పాటు విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయి" అని తెలిపారు. పీపీపీ విధానంలో సహకరిస్తున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలను ఆమె అభినందించారు. మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల గరిష్ట భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని సూచించారు.

స్పోకెన్ ఇంగ్లీష్ సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలను క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, గంగాధర మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్ రావు సమన్వయం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలలలో నమోదు పెంపుతో పాటు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్ సిద్ధతకు దోహదపడతాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com